ఈనాడు మహబూబాబాద్

బుధవారం అక్టోబరు 16, 2024 | 5

నేడు మానుకోటలో నీటి సరఫరా నిలిపివేత

మహబూబాబాద్, న్యూస్‌టుడే: మహబూబాబాద్ పట్టణంలోని మిషన్ భగీరథ పథకం నీటి సరఫరాను నిలిపివేస్తున్నట్లు పురపాలక కమిషనర్ నోముల రవీందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన వాటర్ గ్రిడ్ వద్ద సంప్‌ను శుభ్రం చేసేందుకు బుధవారం నీటి సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ట్యాంకును త్వరగా శుభ్రం చేసి నీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి



కురవి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

కురవి, న్యూస్‌టుడే: విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన కురవి, బలపాల గ్రామాల్లోని గిరిజన ఏకలవ్య గురుకులం, గిరిజన ఆశ్రమ పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు సకాలంలో పాఠశాలకు హాజరు కావాలన్నారు. విద్యార్థుల వసతి గృహాలలో గదులు, మరుగుదొడ్లు, పరిసరాలను శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు.. తాగునీరు, విద్యుత్తు సదుపాయం ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బలపాలలో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని పరిశీలించి వైద్యాధికారులతో మాట్లాడారు. కురవి తహసీల్దార్ సునీల్‌రెడ్డి, ఎంపీడీవో వీరబాబు ఉన్నారు.

విడిపోని బంధానికి 22 ఏళ్లు



వీణ, వాణీలతో తల్లిదండ్రులు మురళి-నాగలక్ష్మి

దంతాలపల్లి (మరిపెడ), న్యూస్‌టుడే: అవిభక్త కవలలు వీణ-వాణీ 22వ వసంతంలోకి అడుగుపెట్టనున్నారు. బుధవారం 22వ జన్మదినం జరుపుకోనున్నారు. ఇద్దరు అవిభక్త కవలలను విడదీయాలని ప్రభుత్వాలను, వైద్యులను వేడుకుంటున్నా ఫలితం లేదని వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పుట్టినప్పటి నుంచి 13 ఏళ్ల దాకా హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆసుపత్రి వారికి అండగా నిలిచింది. కొంత కాలం క్రితం వీరిని హైదరాబాద్‌లోని శిశు విహార్ (స్టేట్‌హోం)కు తరలించారు.

22 ఏళ్లుగా అక్కడే..

మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం బీరిశెట్టిగూడెం గ్రామానికి చెందిన మారగాని మురళీ-నాగలక్ష్మి దంపతులకు నలుగురు కూతుర్లు, పెద్ద కుమార్తె బింధు, రెండో సంతానంగా వీణవాణీ అవిభక్త కవలలుగా జన్మించారు. సింధు నాలుగో సంతానం. 2003 అక్టోబర్ 16న సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఇద్దరు జన్మించారు. పుట్టుకతో వీరు తలలు కలిసి జన్మించారు. నిరుపేద కుటుంబం కావడంతో రెండేళ్ల పాటు గుంటూరుకు చెందిన వైద్యుడు నాయుడమ్మ దగ్గర చికిత్స అందించారు. అనంతరం 2006లో హైదరాబాద్ నీలోఫర్ ఆసుపత్రికి తరలించారు. ఇద్దరిని వేరు చేసేందుకు ముంబయిలోని బ్రీచ్‌కండీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. మూడు నెలల పాటు అన్ని రకాల వైద్య పరీక్షలు చేసి ఆపరేషన్ చేయకుండా వైద్యులు చేతులెత్తేశారు. పలు దేశాలకు చెందిన ప్రఖ్యాత వైద్యులు ఆపరేషన్ చేసేందుకు ముందుకు వచ్చిన నేటికి వారికి ఇబ్బందులు తప్పడం లేదని, శస్త్రచికిత్సకు అవసరమైన ఖర్చును ప్రభుత్వం భరించాలని కోరుతూ అప్పటి ముఖ్యమంత్రులను కలిసిన ఫలితం లేకుండా పోయిందని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. పిల్లలు రోజురోజుకు నరకయాతన అనుభవిస్తున్నారు. దీంతో తల్లిదండ్రులు వారిని వదిలి ఉండలేని పరిస్థితి. తమ పిల్లలకు శస్త్రచికిత్స చేసి వేరు చేయాలని వేడుకుంటున్నారు. వీణవాణీలు శిశువిహార్‌లో డిగ్రీ సీఏ చివరి సంవత్సరం విద్యనభ్యసిస్తున్నారు.

బకాయిల భారం.. భవనాలకు తాళం..!

మహబూబాబాద్, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో మెరుగైన విద్య అందించేందుకు గత ప్రభుత్వం గురుకుల విద్యాలయాలను నెలకొల్పింది. జిల్లాలో కొన్ని గురుకులాలకు సొంత భవనాలుండగా మరికొన్ని అద్దె గృహాల్లో నిర్వహిస్తున్నారు. ప్రధానంగా ఎనిమిది నెలలుగా యాజమానులకు అద్దె చెల్లించకపోవడంతో మంగళవారం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లోని అద్దె భవనాల్లో ఉన్న జ్యోతిబాపులే గురుకుల విద్యాలయాలకు మంగళవారం తాళాలు వేశారు. ఆ పాఠశాలలకు వెళ్లిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది ఇబ్బంది పడ్డారు. నెలల తరబడి తమ భవనాలకు అద్దె చెల్లించకపోవడంతో ప్రభుత్వం రూ.లక్షలు బకాయి పడిందని వెంటనే చెల్లించాలని కోరుతూ భవన యాజమానులు కొన్ని విద్యాలయాలకు తాళం వేయడం సర్వత్రా చర్చనీయాంశమైంది. జిల్లాలో బాలికలు, బాలురు కలుపుకొని జ్యోతిబాపులే బీసీ గురుకుల విద్యాలయాలు ఆరు ఉన్నాయి. ఈ విద్యాలయాలన్నీ కూడా అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. గూడూరు మండలం మర్రిమిట్ట, దంతాలపల్లి, తొర్రూరు (పెద్దవంగర)లోని జ్యోతిబాపులే గురుకులాలకు తాళాలు వేశారు. మిగిలిన విద్యాలయాలు కొనసాగుతున్నాయి. జిల్లానే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా గురుకులాలకు తాళాలు వేయడంతో ప్రభుత్వం మూడు నెలలకు సంబంధించిన అద్దె బకాయిలను విడుదల చేసినట్లు అధికారులు తెలుపుతున్నారు. సాయంత్రం వాటి తాళాలను తొలగించారు. ప్రైవేట్ అద్దె భవనాల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎ.దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ. చాలా వరకు సగం బకాయి అద్దెలను సాయంత్రం వరకు జమ చేయడంతో విరమించుకున్నామని చెప్పారు.



దంతాలపల్లిలోని ఎంజేపీ పాఠశాల గేటుకు తాళం వేస్తున్న యజమాని

గురుకుల పాఠశాలకు తాళాలు

అద్దె చెల్లించాలని డిమాండ్ చేస్తూ దంతాలపల్లిలోని మహాత్మా జ్యోతిబాపులే బీసీ విద్యార్థుల గురుకుల పాఠశాలకు ఇంటి యజమాని తాళం వేశారు. యజమాని కుడుముల శంభారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం...దంతాలపల్లిలోని భారతీ విద్యామందిర్ పాఠశాల భవనంలో మహాత్మా జ్యోతిబాపులే బీసీ బాలుర గురుకుల పాఠశాలను నిర్వహిస్తున్నారు. నెలకు రూ.2 లక్షల చొప్పున అద్దె భవనంలో కొనసాగిస్తున్నారు. ఏడు నెలలకు సంబంధించిన సుమారు రూ.14 లక్షల అద్దె బిల్లులు నిలిచిపోయాయి. విడుదల చేయకపోవడంతో ఉదయం పాఠశాల గేటుకు తాళాలు వేశారు. విధులకు హాజరైన ఉపాధ్యాయులు నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. సమస్యను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు ప్రధానాచార్యుడు శ్రీనివాస్ తెలిపారు. కొద్దిసేపటికి అధికారుల సూచన మేరకు యజమాని తాళాలు తీయడంతో ఉపాధ్యాయులు విధులకు హాజరయ్యారు. – న్యూస్‌టుడే, దంతాలపల్లి (మరిపెడ)

పది నెలలుగా చెల్లించలే..

గూడూరు మండలంలోని మర్రిమిట్ట సమీపంలో నిర్వహిస్తున్న జ్యోతిబాపులే గురుకుల విద్యాలయ భవన సముదాయానికి పది నెలలుగా అద్దె చెల్లించడం లేదంటూ యజమాని తాళం వేశారు. మంగళవారం ఉదయం 8 గంటలకు ప్రధాన ద్వారానికి తాళం వేశారు. దీంతో సిబ్బంది కొంతసేపు ఆరుబయట ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. అనంతరం ప్రైవేటు యాజమానుల సూచనల మేరకు తాళం తీశారు. సుమారు రెండు గంటల పాటు ఇబ్బంది పడ్డారు. – న్యూస్‌టుడే, మహబూబాబాద్



మర్రిమిట్ట సమీపంలో..

తొర్రూరులో..



తాళం వేస్తున్న యజమాని దేవేందర్‌రెడ్డి

గురుకుల పాఠశాల, కళాశాలల అద్దె భవనాల యజమానుల పిలుపు మేరకు మంగళవారం తాళాలు వేశారు. తొర్రూరు డివిజన్ కేంద్రంలోని అమ్మాపురం రోడ్డునందున్న మహాత్మాజ్యోతిబాపులే, కంఠాయపాలెం రోడ్డునందున్న మైనార్టీ గురుకుల పాఠశాల, సన్నూరు క్రాస్‌రోడ్డు వద్ద ఉన్న గురుకుల డిగ్రీ కళాశాల భవనాలకు ఉదయం నుంచే తాళాలు వేశారు. దీంతో ఉపాధ్యాయులు బయటనే వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి మేరకు సుమారు 2 గంటల తరువాత తీశారు. – న్యూస్‌టుడే, తొర్రూరు

☛ కొన్ని నెలల కిందట బదిలీల్లో భాగంగా గురుకుల విద్యాలయాల్లో ప్రధానోపాధ్యాయులు కొత్తగా బాధ్యతలు చేపట్టారు. బిల్లులు తయారు చేయడంలో ఆలస్యంగా జరిగిందని జ్యోతిబాపులే గురుకుల విద్యాలయాల జిల్లా సమన్వయకర్త స్వరూపారాణి 'న్యూస్‌టుడే'కు తెలిపారు. ప్రభుత్వం మూడు నెలల బకాయిలను విడుదల చేయడంతో భవన యజమానులు తాళాలు తీసినట్లు వివరించారు.

ఎన్నికల హామీల అమలు ఎప్పుడు..?



ప్రదర్శనలో ఎన్డీ నేతలు

నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మండల వెంకన్న, జిల్లా కార్యదర్శి బండారి ఐలయ్య డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని భట్టు అంజయ్య భవన్ నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పది నెలలు దాటినా ఇచ్చిన ఆరు గ్యారంటీలను పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నారు. ప్రజాపాలన పేరుతో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి వాటిని ఇప్పటి వరకు పరిష్కరించక పోవడం విచారకరమన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి హలావత్ లింగన్న, నాయకులున్నారు.

'ముదిరాజ్‌లు పేర్లు నమోదు చేసుకోవాలి'



సమావేశంలో మాట్లాడుతున్న బండా ప్రకాష్

మరిపెడ, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులగణన మొదలుపెట్టినందున రాష్ట్రంలోని ముదిరాజ్‌లు తమ పేర్లను నమోదు చేయించుకోవాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, శాసన మండలి డిప్యూటీ ఛైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్ అన్నారు. మంగళవారం మరిపెడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ గణన చేయడం శుభ పరిణామమని దీనిని స్వాగతిస్తున్నట్లు చెప్పారు. జనాభాకు అనుగుణంగా పదవులు లేక అట్టడుగు వర్గాలు వెనుకకు పోకుండా వెనకబడిన వర్గాలకు బీసీ కులగణన ఉపయోగపడుతుందని తెలిపారు. జనాభాకు అనుగుణంగా పదవులు రాక ముదిరాజ్‌లు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జనాభా సేకరణలో అన్ని జిల్లాల అధ్యక్షులు, మండలాధ్యక్షులు పాల్గొని ముదిరాజ్‌ల్లో చైతన్యం తీసుకురావాలన్నారు.

ఆర్టీసీ పండగ చేసుకుంది..!

● 14 రోజుల్లో రూ.28.99 కోట్ల ఆదాయం

వరంగల్ - హైదరాబాద్

దసరా ఆర్టీసీ కలిసొచ్చింది. పెద్ద ఎత్తున ప్రయాణికులను చేరవేసి అదనపు ఆదాయాన్ని సంపాదించుకుంది. గతంలో పండగ సమయంలో ప్రత్యేక ఛార్జీలు వసూలు చేసేవారు. ఈసారి హైదరాబాద్ రూట్‌లో మాత్రమే ప్రత్యేక ఛార్జీలు పెట్టారు. అయినప్పటికీ అంచనా ప్రకారం అనుకున్న ఆదాయం రాబట్టింది. అక్టోబర్ 2 నుంచి పాఠశాలలు, 4 నుంచి కళాశాలలకు సెలవులు ప్రకటించడం, మహాలక్ష్మి పథకం అమల్లోకి రావడంతో మహిళలు ఉచిత ప్రయాణం చేయడం లాంటి కారణాలతో అనుకున్న లక్ష్యం చేరుకుంది..

–హనుమకొండ చౌరస్తా, న్యూస్‌టుడే

- వరంగల్ రీజియన్‌లో వరంగల్ 1, వరంగల్ 2, హనుమకొండ, భూపాలపల్లి, పరకాల, జనగామ, మహబూబాబాద్, తొర్రూరు, నర్సంపేట డిపోలు ఉన్నాయి.
- అక్టోబర్ 1 నుంచి 14 వరకు 850 ప్రత్యేక బస్సులు నడిపించారు.
- 14 రోజుల్లో 20 లక్షల నుంచి 25 లక్షల మంది ప్రయాణించారు..
- మొత్తం 50 లక్షల కిలోమీటర్లు తిరిగి రూ.28.99 కోట్ల ఆదాయం సంపాదించారు. గతేడాది 13 రోజుల్లో రూ.19 కోట్ల ఆదాయమే వచ్చింది.



హనుమకొండ ప్రధాన బస్టాండులో ప్రయాణికుల రద్దీ

దూర ప్రాంతాలకు

రీజియన్‌లోని వివిధ డిపోల నుంచి హైదరాబాద్, బెంగళూరు, పుణె, విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, నిజామాబాద్, ఖమ్మం, కరీంనగర్ తదితర ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు నడిపించారు. ప్రయాణికులు ముందస్తు రిజర్వేషన్ సదుపాయాన్ని ఎక్కువగా వినియోగించుకున్నారు. పండగకు ముందు మూడు రోజులు, తర్వాత రెండు రోజులు అంతర్రాష్ట్ర సర్వీసుల్లో ఎక్కువ మంది ప్రయాణించారు.

అధికారుల ప్రత్యేక దృష్టి

తిరుగు ప్రయాణంలో భాగంగా ఈ నెల 13, 14 తేదీల్లో ఆర్టీసీ రీజియన్ అధికారులు హైదరాబాద్, ఉప్పల్ ప్రాంతాల్లో ఉండి రద్దీకి అనుగుణంగా బస్సులను నడిపించారు. ఉమ్మడి జిల్లాలోని ప్రధాన బస్ స్టేషన్‌లలో డిపో మేనేజర్లు పర్యవేక్షించారు.

వరంగల్

డిపోల వారీగా వివరాలు

డిపో	ఆదాయం(రూ.కోట్లలో)	తిరిగిన కి.మీ(లక్షల్లో)	ఓ.ఆర్ (శాతం)
హనుమకొండ	3.73	6.72	81
జనగామ	3.38	6.16	94
వరంగల్ 1	4.67	7.82	83
వరంగల్ 2	3.93	7.16	86
మహబూబాబాద్	2.03	3.46	103
నర్సంపేట	2.84	4.92	96
పరకాల	2.23	3.79	98
తొర్రూరు	3.29	5.52	104
భూపాలపల్లి	2.85	4.75	97

● డిపో ● ఆదాయం(రూ.కోట్లలో) ● తిరిగిన కి.మీ(లక్షల్లో) ● ఓ.ఆర్ (శాతం)

సిబ్బంది, అధికారుల కృషి వల్లే..



- విజయభాను, ఆర్టీసీ రీజనల్ మేనేజర్, వరంగల్ రీజియన్

ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రద్దీకి అనుగుణంగా బస్సులను నడిపించాం. ఆర్టీసీ కార్మికులు, అధికారులు సమష్టి కృషి ఫలితంగా అనుకున్న మేరకు ఆదాయాన్ని తీసుకొచ్చాం. ప్రయాణికులు ఎక్కువగా ఆదరించారు. మరో రెండు రోజుల పాటు రద్దీ కొనసాగనుంది. లోటుపాట్లను సవరించుకొని సేవలు అందిస్తాం.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలనలో కదలిక

మరిపెడ, న్యూస్‌టుడే: లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం (ఎల్‌ఆర్‌ఎస్) అమలు వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం జిల్లా పాలనాధికారులను ఆదేశించిన నేపథ్యంలో మరిపెడ మండలంలో దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ పునఃప్రారంభమైంది. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దరఖాస్తుల పరిశీలన ప్రారంభించారు. నాలుగేళ్లుగా ఎదురుచూస్తున్న ప్రజలకు ఉపశమనం కలిగించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రెవెన్యూశాఖ మంత్రి మూడుసార్లు సమీక్షలు నిర్వహించి ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. 2020 ఆగస్టు, సెప్టెంబరులో ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించింది. అనంతరం వివిధ కారణాలతో పథకం అమలు నిలిచిపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ ఏడాది జనవరిలో ఎల్‌ఆర్‌ఎస్‌ను తిరిగి ప్రారంభించింది. 2020 ఆగస్టు 31న జారీచేసిన జీవో నెం.131, 2023 జులై 31న జీవో నెం.135లలోని నిబంధనలే ఎల్‌ఆర్‌ఎస్‌కు వర్తిస్తాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. 2020 ఆగస్టు 26కు ముందు రిజిస్టర్ చేసిన అనుమతి లేని, చట్టవిరుద్ధమైన లే అవుట్లు, ప్లాట్లకు మాత్రమే పథకం వర్తిస్తుందని పేర్కొంది. మరిపెడ పురపాలిక పరిధిలో మొత్తం 2592 మంది, మండలంలోని 16 గ్రామాల్లో 646 మంది క్రమబద్ధీకరణకు దరఖాస్తులు సమర్పించారు. మండలంలోని అబ్బాయిపాలెంలో అత్యధికంగా 335, బీచ్‌రాజ్‌పల్లిలో 106, ఆనేపురంలో 79, పురుషోత్తమాయగూడెంలో 74, బురహానపురంలో 26, బావోజిగూడెంలో 1, బోడతండాలో 2, దంటకుంట తండాలో 1, గిరిపురంలో1, లచ్చతండాలో 1, మూలమర్రితండాలో 1, నీలికుర్తిలో 2, రాంపురంలో1, తానంచర్లలో 5, ఎల్లంపేటలో 4, ఎల్లారిగూడెంలో 7 దరఖాస్తులు అందాయి. దరఖాస్తుల పరిశీలన, ఆమోదం, రుసుం వసూలుకు వివిధ దశలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రభుత్వ భూములను రక్షిస్తూ, అర్హత ఉన్న లే అవుట్లను క్రమబద్ధీకరించే బాధ్యతలను కలెక్టర్లకు అప్పగించారు. పురపాలిక, రెవెన్యూశాఖలే కాకుండా, నీటిపారుదల, ఇతర శాఖలకు చెందిన సిబ్బందిని వినియోగించి దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేసేందుకు కార్యాచరణ రూపొందించారు.

నూతన ఉపాధ్యాయులకు పాఠశాలల కేటాయింపు



డీఈఓ రాజేశ్వర్ నుంచి ఉత్తర్వును అందుకుంటున్న నూతన ఉపాధ్యాయురాలు ఉమ

మానుకోట, న్యూస్‌టుడే: ఇటీవల డీఎస్సీ-2024లో ఎంపికైన జిల్లాలోని ఉపాధ్యాయులకు పాఠశాలల కేటాయింపునకు మంగళవారం జిల్లా కేంద్రంలోని ఫాతిమా హైస్కూల్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. వివిధ కేటగిరీల్లో ఎంపికైన 362 మంది ఉపాధ్యాయులకు ఈ నెల 9న నియామక పత్రాలు ఇచ్చారు. 10, 11న వీరంతా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో జాయినింగ్ రిపోర్టు కూడా ఇచ్చారు. వీరికి పాఠశాలలను కేటాయించి పోస్టింగ్‌లు ఇచ్చేందుకు మాన్యువల్ విధానంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉదయం 9.30 గంటలకే ప్రారంభమవుతుందని తొలుత ప్రకటించి కొద్దిసేపటికి వాయిదా పడినట్లు తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటల తర్వాత నిర్వహించనున్నట్లు మళ్లీ సమాచారం ఇచ్చి ఆ మేరకు ప్రారంభించి రాత్రి వరకు కొనసాగించారు. తమకు కేటాయించిన పాఠశాలల్లో బుధవారం చేరాల్సి ఉంటుందని డీఈఓ రాజేశ్వర్ తెలిపారు. ఏసీజీఈ శ్రీరాములు, డీఎస్వో అప్పారావు, సూపరింటెండెంట్ ఉమామహేశ్వర్‌రావు, సమగ్రశిక్ష సమన్వయకర్తలు సంతోష్, అజాద్ చంద్రశేఖర్, జిల్లా విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది, ఎంఈఓలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంఘాల వాగ్వాదం

నెహ్రూసెంటర్: ఉపాధ్యాయుల పోస్టుల ఖాళీల కేటాయింపు విషయంలో ఉపాధ్యాయ సంఘాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఫాతిమా పాఠశాలలో నిర్వహించిన ఉపాధ్యాయుల కౌన్సెలింగ్ సమయంలో ఓ అప్‌గ్రేడ్ ఉన్నత పాఠశాలకు సంబంధించి ఉపాధ్యాయ పోస్టుల కేటాయింపు విషయంలో రెండు సంఘాల బాధ్యులు గొడవ పడ్డారు. విద్యాశాఖ అధికారుల జోక్యంతో వివాదం సద్దుమణిగింది.



కౌన్సెలింగ్ కేంద్రం వద్ద సందడి



ఉపకార వేతనాలు విడుదల చేయాలని రాస్తారోకో

నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే: డిగ్రీ, పీజీ కళాశాల ఉపకారవేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ. పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్, టీజేఎస్ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని మదర్‌థెరిసా కూడలిలో రాస్తారోకో నిర్వహించారు. ముందుగా మానుకోట ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం నుంచి విద్యార్థులు, పలు సంఘాల నేతలు నిరసన ప్రదర్శన నిర్వహించి మదర్‌థెరిసా కూడలిలో రాస్తారోకో చేశారు. నలంద డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ డోలి సత్యనారాయణ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న బిల్లులను సకాలంలో విడుదల చేయక పోవడం వల్ల విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితి నెలకొందన్నారు. వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘాల నాయకులతో పాటు కళాశాలల ప్రధానాచార్యులు అధ్యాపకులు, విద్యార్థులున్నారు.

ఆహారం విలువ తెలిసి.. ఆకలి తీర్చి..

ఒకవైపు ఆకలితో అలమటించేవారు.. మరోవైపు ఆహారం ఎక్కువై వృథా చేస్తున్నవారు మనకు కనిపిస్తుంటారు. ప్రతి మెతుకు నిరుపేదలు, అనాథల కడుపు నింపితే అంతకంటే మేలు మరొకటి ఉండదు. ఈ నిజాన్ని గుర్తించి ఆహారం వృథా కాకుండా అన్నదానం రూపంలో పేదలకు అందజేస్తున్న వారెందరో ఉన్నారు. బుధవారం ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవాన్ని పురస్కరించుకుని నేటి కాలంలో ఆహారం ఎంత విలువైందో.. దాన్ని వృథా చేయకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కథనం..

నేడు ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవం



కాజీపేట, శివనగర్, న్యూస్‌టుడే

ఆ బాధ తెలుసు కాబట్టే..

- రాందేని ధనలక్ష్మి, శ్రీనివాస్, హనుమకొండ



మా బాబు అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స కోసం ఐదునెలలు ఉన్నప్పుడు ఆకలి బాధ తెలిసింది. ప్రతి రోజు ఆహారం పంపిణీ చేసే స్వచ్ఛంద సంస్థలను చూసేవాళ్లం. వారి దాతృత్వం చూశాక ఆకలితో ఉన్నవారికి ఆహారం అందించాలనిపించింది. ఈ ఆలోచన కరోనా సమయంలో రాగా గురుదక్షిణ నిత్యాన్నదాన సొసైటీ ఏర్పాటు చేసి వరంగల్, హనుమకొండ, కాజీపేట రైల్వే, బస్టాండ్లు, ఫుట్‌పాత్‌లపై ఉండే అనాథలు, మానసిక ఇబ్బందులతో ఉన్న వారికి అన్నదానం చేస్తున్నాం.

లక్షన్నర మందికి

- కొండమీది రాజన్ బాబు, ఉర్సు, వరంగల్

కరోనా సమయంలో ఆకలితో బాధపడుతున్న అనాథలకు అన్నదానం చేయడంతో మొదలైన నా సేవ కన్నతల్లి ఫౌండేషన్ ఏర్పాటుకు దారితీసింది. సంస్థ ద్వారా శుభకార్యాలు, ఫంక్షన్



హాళ్లలో, మిగిలిన ఆహారం సేకరించి శంభునిపేట, వరంగల్ బస్టాండ్, రైల్వేస్టేషన్, వరంగల్ చౌరస్తా, ఎంజీఎం ఆసుపత్రిలో అన్నదానం చేస్తున్నాను. మిగిలిన భోజనం ఇస్తే మా సంస్థ ద్వారా ప్లేట్లు, గ్లాసులు, తాగునీరు తీసుకెళ్లి అన్నదానం చేస్తున్నాం. ఇప్పటికి లక్షన్నర మందికి అన్నదానం చేశాం.

● ఆహారం మిగిలితే 97017 51278 నెంబరుకు తెలియజేయాలి.

మీకు తెలుసా..

మన ఆహార అలవాట్లు ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని వరల్డ్ వైల్డ్ లైఫ్ ఫండ్ (డబ్ల్యూడబ్ల్యూఎఫ్) నివేదిక పేర్కొంది. వృథా చేయకుండా పర్యావరణ హితంగా ఆహారం తీసుకోవడం వల్ల మన దేశం ఆహార ఉత్పత్తికి ఇతర దేశాలకంటే తక్కువ భూభాగం వాడుతున్నామని చెప్పింది. జనాభా ఎక్కువగా ఉన్నా కేవలం 0.8 శాతం భూమిని మాత్రమే వాడుతున్నాం. చైనా 1.7 శాతం, జపాన్ 1.8, అర్జెంటీనా 7.4 ఆస్ట్రేలియా 6.8, అమెరికా 5.5 శాతం వాడుతున్నాయని నివేదిక తెలిపింది. ● ఉమ్మడి వరంగల్ జిల్లా ఇతర జిల్లాలతో పోలిస్తే ఆహార ఉత్పత్తికి 0.75 శాతం వినియోగిస్తోందని వ్యవసాయ శాఖ తెలిపింది.



పల్లగుట్ట ఉన్నత పాఠశాలలో తిథి భోజనం.. పాఠశాల పరిధిలో ఎవరైనా విద్యార్థులకు ఇలా ఆహారం అందజేస్తారు



లెక్క పెట్టి మరీ..

అమెరికాలాంటి దేశాల్లో శుభకార్యాలు చేయడానికి, ఆహ్వానంతో పాటు గూగుల్ ఫారం కూడా పంపుతారు. ఆన్‌లైన్‌లో శుభకార్యానికి వస్తున్నారా లేదా.. వస్తే ఎంత మంది వస్తారు అనే విషయాన్ని అందులో పొందుపరచాలి. దీన్ని బట్టి వంటలు తయారు చేస్తారు. దీంతో ఆహారం వృథా కాదు. ఇటీవల ఎన్‌ఐటీ ఆచార్యుడు సి.ప్రసాదు తన కుమారుడి వివాహానికి ఇలాగే ఆన్‌లైన్ ఫారం పంపి దానికి తగినట్లుగా వంటలు చేయించారు.

ఇతర దేశాల్లో..

● ఫ్రాన్స్‌లో మిగిలిపోయిన కూరగాయలు కూడా బయటపడేస్తే నేరంగా భావిస్తారు. వాటిని పేదలకు ఇవ్వాలి. ● నార్వే ఆహార పదార్థాలపై బెస్ట్ బిఫోర్ యూస్ అని ప్రింట్ చేస్తుంది. ఇటలీ, ఫ్రాన్స్, చైనా, అమెరికాలోనూ ఇలాంటి చట్టాలున్నాయి.

అవును.. నిజమే!

● ప్రతిరోజు వరంగల్ మహా నగరపాలక సంస్థ సేకరిస్తున్న వ్యర్థాల్లో సుమారు 40 టన్నులు ఆహార వ్యర్థాలే ఉంటున్నాయని అధికారులు చెబుతున్నారు.
● దేశంలో పోషకాహార లోపంతో బాధపడుతున్న వారి సంఖ్య 14 శాతం ఉంది. వృథా ఆహారం వారికి అందేలా చేయడం ద్వారా వారి శాతం తగ్గించొచ్చు.
● కుళ్లిన ఆహార పదార్థాలను చెత్తకు తరలించడం వల్ల కార్బన్ డై ఆక్సైడ్ కంటే 80 రెట్లు ఎక్కువ శక్తివంతమైన గ్రీన్‌హౌస్ వాయువైన మీథేన్ విడుదలవుతోందని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు.

ఈ జాగ్రత్తలు తీసుకుందాం

● బంగాళదుంపలు, టమాటాలు, ఉల్లిపాయలు, వెల్లుల్లి, దోసకాయలు ఫ్రిజ్‌లో కాకుండా గది ఉష్ణోగ్రతలోనే నిల్వచేయాలి.
● ఆకుకూర కాడలను నీటిలో ఉంచడం ద్వారా నిల్వ చేసుకోవచ్చు.
● బ్రెడ్ గడువులోగా వాడేయలేమని భావిస్తే ఫ్రిజ్‌లో నిల్వచేయాలి.
● దుకాణం నుంచి ఆహార పదార్థాలను కొనుగోలు చేసే సమయంలో వాటి నిల్వ కాలం చూసుకొని తెచ్చుకోవాలి.
● తరచూ ఆహారం మిగులుతుంటే దాన్ని ఫ్రిజ్‌లో పెట్టి ఒక రోజు వాటిని ఉపయోగించేలా ప్రణాళిక వేసుకోవాలి
● పెరటిలోని కూరగాయల మొక్కలకు కంపోస్టు ఎరువుగా వేయడం ద్వారా ఆహార వృథా నివారించవచ్చు.
● ఇంట్లో ఉన్నవారి ఆహార అవసరాన్ని గుర్తించి తయారు చేసుకోవడం, అవసరమైనప్పుడే తయారు చేసుకోవడం వంటి చిట్కాల ద్వారా తగ్గించవచ్చు.
● అదనంగా ఉన్న ఆహారాన్ని దగ్గరి వారికి, పక్క వారికి పంచడం, ఆశ్రమాలకు, అనాథలకు ఇవ్వడం చేయాలి.
● ఆహార బ్యాంకులను ఏర్పాటు చేసి అందులో వేయడం ద్వారా అవసరమైన వారు తీసుకునేలా ఏర్పాట్లు చేయడం.
● ఆహార వ్యర్థాలను తగ్గించడానికి హోటళ్లు, గృహ యజమానులకు ప్రోత్సాహకాలు అందించడం చేయాలి.

పది హేను సంవత్సరాలుగా

- ఆరుట్ల శ్రీనివాస్, సాయి అమృతహస్తం సంస్థ, వరంగల్

15 ఏళ్ల కిందట గురుపౌర్ణమి నాడు అన్నదానంతో మిగిలిన ఆహారాన్ని అనాథలకు పంపిణీతో మొదలైన నా సేవ ఇప్పటికీ కొనసాగిస్తున్నా. సాయి అమృత హస్తం



పేరుతో మిత్రులు పోలా మహేష్, ఎరుకుల్ల నాగేశ్వర్‌రావు, పబ్బ కిషోర్, వేముల శ్రీనివాస్‌తో కలిసి కల్యాణమండపాలు, హోటళ్లు, క్యాటరింగ్ సర్వీసు సెంటర్లలో మా సంస్థ గోడపత్రికలు వేసి, మిగిలిన ఆహారాన్ని మాకు అందించేలా చేస్తున్నాం. అలా నెలలో నాలుగు సార్లు బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో పంపిణీ చేస్తున్నాం.

ఇంటి ఆహారంలోనే..

- డాక్టర్ యాట రోహిత్‌రెడ్డి, వడ్డేపల్లి



ఇంటి ఆహారంలో తాజాదనం ఉంటుంది. ఎక్కువగా నూనెలు వాడకుండా ఉడికించి తింటాం కాబట్టి అందులోని లవణాలు, విటమిన్లు పాడవకుండా ఉంటాయి. వృథా కూడా తక్కువే.. బయటి హోటల్ యజమానులు అమ్ముడు పోని కూరగాయలు వాడుతారు కాబట్టి తాజాదనం తగ్గుతుంది.



నాలుగేళ్లుగా అన్నదానం

- నార్లపురం రాజు

మాది జనగామ జిల్లా పాలకుర్తి. చదువుకోడానికి హనుమకొండకు వచ్చాక ఇక్కడ ఆకలి బాధ తెలిసింది. అడ్వాన్స్‌డ్ లైఫ్ ఫౌండేషన్ సంస్థను ఏర్పాటుచేసి, దాని ద్వారా ఆహారాన్ని ఫంక్షన్ హాళ్ల నుంచి సేకరించి నాలుగేళ్లుగా అనాథలు, ఆశ్రమాలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో పంపిణీ చేస్తున్నాను.

ఇలా చేస్తే మేలు..

కార్పొరేషన్ ఆధ్వర్యంలో వృథా ఆహారాన్ని పేదలకు అందించే వ్యవస్థ ఏర్పాటుచేసి ఒక హెల్ప్‌లైన్ నెంబరు ఏర్పాటు చేయాలి. వరంగల్ హెల్పింగ్ హ్యాండ్ చాలెంజ్, సహారా ఫౌండేషన్ సంస్థలు సామాజిక మాధ్యమాల ద్వారా వృథా ఆహారాన్ని సేకరించి అనాథలకు పంచుతున్నాయి. శుభకార్యాల్లో మిగిలిన ఆహారం తీసుకోవడానికి సహృదయ ఆశ్రమం, సాయి అనాథ సేవా ట్రస్టు, ఆరోగ్య సామాజిక సేవా సంస్థ, డాన్‌బాస్కో శివనగర్, హౌజ్ ఆఫ్ జాయ్ ఉంటాయి..

ప్రజల్లో అవగాహన పెరిగింది..

- ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి, వరంగల్



ఆహార పదార్థాల వినియోగంపై వరంగల్ ప్రజల్లో అవగాహన పెరుగుతుంది. ఆచితూచి కొనుగోలు చేస్తున్నారు. కొన్ని చోట్ల మోసాలు జరుగుతున్నాయి. తాము గమనించి కేసులు నమోదు చేస్తున్నాం.

అంకెల్లో వివరాలు..

వరంగల్‌లో ఆహారం వృథా : 18 శాతం

ఇందులో శుభకార్యాల్లో 10

ఇంటిలో.. 1

హాస్టళ్లలో.. 2

హోటళ్లలో 3

ఇతర 2



రాయితీ రుణం ఇప్పిస్తామని టోకరా

ఎల్కతుర్తి, న్యూస్‌టుడే: ప్రభుత్వం నుంచి రాయితీ రుణం ఇప్పిస్తామని నమ్మించి ఒకరు టోకరా వేసిన ఘటనపై ఆలస్యంగా కేసు నమోదు అయింది. ఎస్‌ఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దామెరకు చెందిన కొక్కు తిరుపతి చరవాణికి ఈ ఏడాది ఏప్రిల్ 2న గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేశారు. మీకు ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకం రుణం రూ.10 లక్షలు మంజూరైందని ఒకసారి, రుణం ఇప్పిస్తానని ఒకసారి చెప్పారు. కొంత డబ్బు చెల్లిస్తే రుణం త్వరగా మీ బ్యాంకు ఖాతాలో జమ అవుతాయని నమ్మించారు. రుణం వస్తుందని ఆశపడిన తిరుపతి గుర్తు తెలియని వ్యక్తి చెప్పిన ఖాతాకు పలు దఫాలుగా రూ.98,530 ఫోన్‌పే ద్వారా నగదు బదిలీ చేశారు. కొద్ది రోజులకు ఆ నెంబరుకు ఫోన్ చేసి ఇంకా రుణం రాలేదని అడగ్గా.. కొంత సమయం పడుతుందని సమాధానం ఇచ్చారు. నెలలు గడిచినా రుణం మంజూరు కాకపోవడంతో అవతలి వ్యక్తికి ఫోన్ చేస్తే స్విచ్ఆఫ్ అని వచ్చింది. మోసపోయానని గ్రహించిన బాధితుడు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సైబర్ క్రైమ్ కింద కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

161 క్వింటాళ్ల రాయితీ బియ్యం పట్టివేత



బియ్యం స్వాధీనం చేసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు అందిచాల్సిన రాయితీ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచిన కేంద్రాలపై మంగళవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. మొత్తం రూ.4.19 లక్షల విలువచేసే 161 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.మధుసూదన్ కథనం మేరకు.. పరకాలకు చెందిన బి.రఘు, ఎస్.ఉప్పలయ్య కలిసి పరకాల చుట్టు పక్కల గ్రామాల నుంచి తక్కువ ధరకు రాయితీ బియ్యం కొనుగోలు చేసి జ్యోతి రైస్ మిల్లులో నిలువ ఉంచారు. తనిఖీలు నిర్వహించగా సుమారు రూ. 2.63 లక్షల విలువ చేసే 101 క్వింటాళ్ల బియ్యం లభించాయి. నడికూడ మండలం చర్లపల్లి గ్రామానికి చెందిన ఓదేలు రూ.1.17 లక్షల విలువ చేసే 45 క్వింటాళ్ల బియ్యాన్ని అక్రమంగా ఆటోలో తరలిస్తూ పట్టుబడ్డారు. నడికూడ మండలం బుడిగజంగాల గ్రామానికి చెందిన తూర్పాటి ఐలయ్య ఇంట్లో రూ.39 వేల విలువ చేసే 15 క్వింటాళ్లను స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రాజు, ఆరెస్సై భాను ప్రకాశ్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

స్టాఫ్‌నర్సు ప్రొవిజనల్ మెరిట్ జాబితా విడుదల

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: జిల్లా వైద్యారోగ్యశాఖలో గతంలో ఇచ్చిన స్టాఫ్‌నర్సుల నియామక ప్రకటనకు స్పందించి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ప్రొవిజనల్ మెరిట్ జాబితాను డీఎంహెచ్‌ఓ, జిల్లా కలెక్టర్ కార్యాలయం నోటీసు బోర్డులో ప్రదర్శనకు పెట్టినట్లు డీఎంహెచ్‌ఓ డా.వెంకటరమణ తెలిపారు. జాబితాలోని సమాచారంపై అభ్యంతరాలుంటే ఈ నెల 16, 17 తేదీల్లో సాయంత్రం 5 గంటల్లోగా అందజేయాలని కోరారు. ప్రొవిజనల్ మెరిట్ జాబితా కోసం అధికారిక వెబ్‌సైట్ http:///waranagl.telanagana.gov.in చూడాలని సూచించారు.

చెరువు శిఖం.. కబ్జాల పర్వం

● హైడ్రా తరహా ఏర్పాటే శరణ్యం..



ధర్మసాగర్ రిజర్వాయర్‌లో మొరం పోసి చదును చేసిన భూమి

ధర్మసాగర్, న్యూస్‌టుడే: ప్రభుత్వం హైడ్రా ఏర్పాటు చేసి హైదరాబాద్ నగరంలోని చెరువుల్లో ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతోంది. ప్రణాళిక ప్రకారం ముందుకెళ్తూ అక్రమ నిర్మాణాలను తొలగిస్తోంది. అలాంటి వ్యవస్థే హనుమకొండ నగరంలోనూ అవసరమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. నగరం చుట్టుపక్కల చెరువు శిఖం భూమి కనిపిస్తే చాలు హద్దులు పాతుతున్నారు. ధర్మసాగర్ మండలంలోని పలు గ్రామాల్లో చెరువులు, కుంటలకు ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంకు లెవల్) గుర్తించి, హద్దులు ఏర్పాటు చేయడంలో నీటి పారుదల శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీన్ని అక్రమార్కులు అవకాశంగా తీసుకుని యథేచ్ఛగా కబ్జా చేస్తున్నారు. కొందరు చెరువు శిఖంలో మొరం పోస్తూ సొంతం చేసుకుంటున్నారు. ఆయా గ్రామాల రైతులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు



శాయిపేట పాత చెరువులో పోసిన మొరం



చేసినా చర్యలు శూన్యం.

● ధర్మసాగర్ రిజర్వాయర్‌లో ముంపునకు గురైన భూమిని ఓ రైతు పట్టా చేసుకుని అందులోని రెండెకరాలను రూ.80 లక్షల చొప్పున ఆరు నెలల కిందట విక్రయించారు. రిజర్వాయర్ చుట్టూ 15 నుంచి 20 ఎకరాల వరకు సమీప రైతులు కొందరు పట్టా చేసుకున్నారు. మరికొందరు ముంపునకు గురైన భూముల్లో మట్టి, మొరం పోసి ఎత్తు పెంచుకొని సాగు చేసుకుంటున్నారు.

● ఎలుకుర్తిలోని సర్వే నెంబర్ 141లో మర్రిచెరువు 40.33 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. దీని శిఖం ఇప్పటికే 10 ఎకరాల వరకు కబ్జా అయినట్లు సమీప రైతులు ఆరోపిస్తున్నారు.

● పెద్దపెండ్యాలలో మూడేళ్ల కిందట ఓ రైతు కట్టను తొలగించి చెరువు భూమిని తన పొలంలో కలుపుకొనే ప్రయత్నం చేశారు. ఇదే గ్రామంలో మరో చెరువు మత్తడి పోసే చోట మట్టి పోసి నీరు రాకుండా చేశారు.

● శాయిపేట పాత చెరువులో భూమి తన పట్టా స్థలమంటూ మూడేళ్ల కిందట ఓ రైతు చెరువు కట్టను తొలగించి, మొరం పోయించారు. మాజీ ప్రజాప్రతినిధులు, స్థానిక రైతులు దాన్ని అడ్డుకున్నారు. ఇప్పటి వరకు మరమ్మతులు చేపట్టలేదు. మొరాన్ని తొలగించలేదు. దీంతో వర్షం నీరు, దేవాదుల పైప్‌లైన్ నీరు చెరువులోకి వచ్చినా కిందకు వెళ్లిపోతున్నాయి.

● జానకీపురం, కేశవనగర్, క్యాతంపల్లిలో కుంటలు కబ్జాకు గురవుతున్నాయి.

హద్దులను నిర్ణయిస్తాం..

- సదానందం, తహసీల్దార్, ధర్మసాగర్

నీటి పారుదల, రెవెన్యూ శాఖల సమన్వయంతో మండలంలోని అన్ని చెరువులు, కుంటలకు హద్దులను నిర్ణయించి, సంరక్షణ చర్యలు చేపడతాం. నీటి పారుదల శాఖ అధికారులు ఎఫ్‌టీఎల్‌ను నిర్ణయిస్తే. . సర్వే చేసి ఆయా సర్వే నెంబర్లకు నాలా కన్వర్షన్లు ఇవ్వకుండా, అక్రమ పట్టా చేసుకోకుండా తగిన చర్యలు చేపడతాం.

మల్లన్న హుండీ ఆదాయం రూ.46 లక్షలు

ఐనవోలు, న్యూస్‌టుడే: ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయంలో మంగళవారం హుండీ ఆదాయం లెక్కించారు. ఈ ఏడాది జులై 16 నుంచి అక్టోబర్ 15 వరకు 18 హుండీల ద్వారా వచ్చిన ఆదాయాన్ని మహబూబాబాద్ శ్రీలక్ష్మీ వెంకటేశ్వర సేవా సమితి ఆధ్వర్యంలో దేవాదాయ శాఖ పరిశీలకులు ఎ.అనిల్‌కుమార్ పర్యవేక్షణలో ఆలయ ప్రాంగణంలో లెక్కించారు. హుండీల ద్వారా రూ.20,73,376, వివిధ సేవల టికెట్ల ద్వారా రూ.25,35,820 కలిపి మొత్తం రూ.46,09,196 ఆదాయం వచ్చినట్లు ఈవో నాగేశ్వర్‌రావు తెలిపారు. బంగారం, వెండి, విదేశీ డాలర్లను తిరిగి హుండీలో వేశారు. మూడేళ్లుగా ఆలయ ఆదాయం గణనీయంగా పెరుగుతూ వస్తోందని ఈవో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీనివాస్, ఆర్‌ఐ మల్లయ్య, సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

చరిత్ర తెలుసుకోండి.. వాలంటీర్లుగా నిలవండి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ములుగు పాలనాధికారి దివాకర, ఇంటాక్ కన్వీనర్ పాండురంగారావు తదితరులు



శిబిరానికి హాజరైన వాలంటీర్ల బృందంతో అధికారులు

వెంకటాపూర్, న్యూస్‌టుడే: విద్యార్థి దశలో వచ్చే ప్రతి అవకాశం భవిష్యత్తులో పునాదికి నాంది అని ములుగు జిల్లా పాలనాధికారి టీఎస్ దివాకర అన్నారు. మూడో విడత శిక్షణ శిబిరానికి వచ్చిన ప్రతి ఒక్కరూ చరిత్రను తెలుసుకుని చక్కటి వాలంటీర్‌గా నిలవాలని కోరారు. అక్టోబర్ 15 నుంచి 26 వరకు యునెస్కో గుర్తింపు పొందిన రామప్పలో జరిగే వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ మూడో శిక్షణ శిబిరాన్ని కలెక్టర్ ఇంటాక్ కన్వీనర్ ప్రొఫెసర్ పాండురంగారావుతో కలిసి ప్రారంభించారు. ఐకోమాస్, ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా, తెలంగాణ టూరిజం, కాకతీయ హెరిటేజ్ ట్రస్టు భాగస్వామ్యంతో ప్రారంభమైన శిబిరంలో 80 మంది వాలంటీర్లనుద్దేశించి ఆయన మాట్లాడారు. చరిత్ర, కళలు, పురావస్తు, ఆర్కిటెక్చర్, సివిల్ ఇంజినీరు, టూరిజం విభాగాల్లో నైపుణ్యం కలిగిన ప్రొఫెసర్లు చెప్పే తరగతులను అర్థం చేసుకుని క్షేత్రస్థాయిలో తెలుసుకుని సేవ చేయడానికి ఇదొక అరుదైన అవకాశమన్నారు. రాబోయే రోజుల్లో టూరిజం ద్వారా ఎంతో మందికి ఉపాధి లభిస్తుందని, ఇప్పటి నుంచి అవగాహన పెంచుకుంటే భవిష్యత్తు మీదే అన్నారు. కాకతీయుల ఖ్యాతి ఖండాంతరాలు దాటిందని, దానిని తెలుసుకుని విస్తరించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు. సమయం వృథా చేయకుండా.. ప్రతిభ చూపి కాకతీయ ప్రాశస్త్యాన్ని చాటాలని కోరారు. కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఇంటాక్ సూచనలు చేసింది. కార్యక్రమంలో జిల్లా టూరిజం అధికారి శివాజీ, టూరిజం ప్రమోషన్ అధికారి సూర్యకిరణ్, ఇంటాక్ సభ్యుడు శ్రీధర్‌రావు, అధ్యాపకురాలు శ్రీలత, యోగా గురువు రాంబాబు, ఎంపీడీవో రాజు, పర్యాటక, పురావస్తు శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	126
రిటైల్:	148
డ్రెస్డ్:	215
స్కిన్‌లెస్:	244





మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్, సమ్మారావు, ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి, మరో చిత్రంలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి,

నూకల నరేష్‌రెడ్డికి నేతల నివాళి

మరిపెడ, న్యూస్‌టుడే: దివంగత కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పురుషోత్తమాయగూడెంకు చెందిన నూకల నరేష్‌రెడ్డి దశదినకర్మ మంగళవారం గ్రామంలోని ఏరువాక వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించారు. పలువురు హాజరై ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, శాసనసభ్యులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాజకీయ జీవితంతో నరేష్‌రెడ్డితో తమకు ఉన్న అనుబంధం గుర్తు చేసుకున్నారు.



నివాళి అర్పిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, రఘురాంరెడ్డి, పెద్ది సుదర్శన్‌రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, దయాకర్‌రావు, రావుల శ్రీధర్‌రెడ్డి, బండాప్రకాష్

రూ. 50 కోట్ల నిధులు వచ్చేనా

మహబూబాబాద్ టౌన్, న్యూస్‌టుడే: కేసీఆర్ ఇచ్చిన రూ. 50 కోట్ల నిధులు ఎప్పుడొస్తాయి, మానుకోట మున్సిపాలిటి వార్డుల అభివృద్ధి ఎప్పుడు జరుగుతుందని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్‌సారథిరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని వీరభవంలో సీపీఐ పట్టణ సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. మానుకోట మున్సిపాలిటీ అభివృద్ధికి అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన రూ. 50 కోట్లు ఏమయ్యాయని ప్రశ్నించారు. మున్సిపల్ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, ఆ పార్టీ ప్రజాప్రతినిధులు నిధుల విషయంపై మాట్లాడడం లేదన్నారు. నాయకులు చింత కుంట్ల వెంకన్న, రేషపల్లి నవీన్, పెరుగు కుమార్, వెలుగు శ్రావణ్ తదితరులున్నారు.

ఇన్‌ఛార్జి పశువైద్యాధికారిగా వినోద్

దంతాలపల్లి, న్యూస్‌టుడే: పెద్దముప్పారం పశువైద్య కేంద్రం ఇన్‌ఛార్జి వైద్యాధికారిగా డాక్టర్. వినోద్ బాధ్యతలు స్వీకరించారు. దంతాలపల్లి పశువైద్య కేంద్రం వైద్యాధికారిగా పని చేసిన ఈయన ఇటీవల తొర్రూరు మండలానికి బదిలీ అయ్యాయి. అనంతరం పెద్దముప్పారం పశువైద్య కేంద్రానికి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు.


నెల్లికుదురు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ..


బయ్యారంలో...


కల్వలలో..

అబ్దుల్ కలాం ఆశయ సాధనకు కృషి


బేతోలులో కేక్ కోస్తున్న మైనార్టీ నాయకులు

మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా మంగళవారం జిల్లాలోని పలు గ్రామాల్లో నిర్వహించారు. అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పించారు. కేక్ కోసి పంచిపెట్టారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని వక్తలు కోరారు.

– న్యూస్‌టుడే, బృందం


గూడూరులో వాకర్స్ సంఘ సభ్యులు


డోర్నకల్ పుర కార్యాలయంలో..

'కలాం' స్ఫూర్తి అవార్డు ప్రదానం

తొర్రూరు, న్యూస్‌టుడే: డివిజన్ కేంద్రానికి చెందిన సాహితీవేత్త డి.కుమారస్వామి అబ్దుల్ కలాం స్ఫూర్తి అవార్డు అందుకున్నాడు. మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాం జయంతి సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లోని త్యాగరాజగానసభలో పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అవార్డులు అందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాసనమండలిలో భారాస ప్రతిపక్ష నేత, మాజీ స్పీకర్ మధుసూదనాచారి హాజరై, ప్రదానం చేశారు. అవార్డు అందుకోవడం సంతోషకరంగా ఉందని కుమారస్వామి తెలిపారు.


ఎమ్మెల్సీ మధుసూదనాచారి చేతుల మీదుగా స్వీకరిస్తున్న కుమారస్వామి

మేమున్నాం.. మీకు తోడుగా

మహబూబాబాద్ టౌన్: 98859 29762, మహబూబాబాద్: 9440484123, తొర్రూరు టౌన్: 97019 14499, డోర్నకల్: 94405 15786, మరిపెడ: 80085 74823

మహబూబాబాద్ టౌన్, న్యూస్‌టుడే: వెంకటేశ్వర్ల బజార్‌లో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. కాలనీవాసులు భయాందోళన చెందుతున్నారు. - **శ్రీనివాస్**

సమాధానం: మూడు రోజుల్లో కుక్కలను యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌కు తరలించేలా చర్యలు తీసుకుంటాం. - **రాజేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్.**

మహబూబాబాద్ టౌన్: కాకతీయనగర్‌కాలనీకి వారం రోజులుగా చెత్త బండి రావడం లేదు. - **వెంకన్న**

సమాధానం: వ్యర్థాలు తొలగించేలా చర్యలు తీసుకుంటాం. - **డొలాగర్ స్వామి, 26వ వార్డు కౌన్సిలర్.**

డోర్నకల్: డోర్నకల్‌లోని సుభాష్‌వీధిలో కాలువ పక్కన పొదలు పేరుకుపోయి అవస్థ పడుతున్నాం.. - **మధు**

సమాధానం: శుభ్రం చేయిస్తాం. - **భాగ్యలక్ష్మి, కౌన్సిలర్, డోర్నకల్**

మురుగు తొలగింపు

స్పందనకు వందనం

డోర్నకల్, న్యూస్‌టుడే: అందనాలపాడులోని ఓ వీధిలోని కాలువలో పేరుకుపోయిన మురుగును సిబ్బంది మంగళవారం తొలగించారు. దుర్వాసన నుంచి విముక్తి కలిగిందని స్థానికులు తెలిపారు.

మహబూబాబాద్ టౌన్: స్థానిక వివేకానంద కూడలి నర్సంపేట బైపాస్ రహదారిలోని కాల్వలో పేరుకుపోయరన వ్యర్థాలు తొలగించాలని సెప్టెంబర్ 30న 'ఈనాడు'లో ప్రచురించిన వార్తకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ తోట రాజేష్ స్పందించారు. సిబ్బందిని పంపించి పూడిక తీయించారు.

వీధి దీపానికి మరమ్మతు

డోర్నకల్: డోర్నకల్‌లోని న్యూనెహ్రూ వీధిలోని వీధి దీపానికి సిబ్బంది మంగళవారం మరమ్మతు చేశారు. దీంతో అంధకారం తొలగింది.



వసతిగృహాల పరిశీలన

గార్ల, న్యూస్‌టుడే: స్థానిక వసతి గృహాలను జిల్లా అదనపు కలెక్టరు లెనిన్ వత్సల్‌టొప్పో మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బీసీ, ఎస్సీ బాలికల వసతి గృహాలను పరిశీలించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేలా చూడాలని పంచాయతీ కార్యదర్శి కిషన్‌ను ఆదేశించారు. తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో మంగమ్మ, ఎంఆర్ఐ రామకృష్ణ, జేఏ శ్రీనివాస్ తదితరులున్నారు.

ప్రమాదం జరిగితేనే పట్టించుకుంటారా?..



తొర్రూరు డివిజన్ కేంద్రంలో అభివృద్ధి పనుల్లో భాగంగా పాలకేంద్రం నుంచి కూరగాయల మార్కెట్ వరకు ప్రధాన రోడ్డుకు ఇరువైపులా మురుగు కాలువ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో బస్సులు లోపలికి వచ్చే రోడ్డు పక్కన మురుగు కాలువ నిర్మాణం పూర్తయినప్పటికీ తాగునీటి పైప్ లైను మరమ్మతుకు పెద్ద గుంతను తీసి వదిలేశారు. దీంతో ఆయా కాలనీలకు వెళ్లే ప్రజలతో పాటు రాత్రిళ్లు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పుర అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని, త్వరితగతిన పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, తొర్రూరు

గండి పూడ్చరూ..



గత నెలలో కురిసిన భారీ వర్షాలకు చిన్నగూడూరు-ఉగ్గంపల్లి మధ్యలోని ఆకేరు వాగు వంతెన కూడి వైపు గండి పడి నీరు వృథాగా పోతుంది. వరదలకు పంటలు మునిగి ఇసుక కప్పి రైతన్నకు తీవ్ర నష్టం జరిగింది. పంట చేతికి వచ్చే సమయానికి నీరు లేక పంటలు ఎండిపోయే పరిస్థితి ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వంతెన గండి పూడ్చాలని వేడుకుంటున్నారు.

– న్యూస్‌టుడే, చిన్నగూడూరు (మరిపెడ)

ఉపాధ్యాయుల సంక్షేమమే లక్ష్యం

నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల సంక్షేమమే పీఆర్టీయూ లక్ష్యమని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. రాబోయే ఉపాధ్యాయ శాసన మండలి ఎన్నికల ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల (కంకరబోడ్)లో ఓటరు నమోదు దరఖాస్తులను పంపిణీ చేశారు. త్వరలో జరుగనున్న ఉపాధ్యాయ నల్గొండ, ఖమ్మం, వరంగల్ నియోజక వర్గంలో పీఆర్టీయూ సంఘం అధికారి అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శి సంకా బద్రినారాయణ, మిర్యాల సతీష్‌రెడ్డి, రాష్ట్ర నాయకులున్నారు.

జాతీయవాదులకు అండగా నిలవాలి

దంతాలపల్లి, న్యూస్‌టుడే: రానున్న వరంగల్-ఖమ్మం-నల్గొండ నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో జాతీయవాదులకు ఉపాధ్యాయులు అండగా నిలవాలని ఎమ్మెల్సీ అభ్యర్థి, తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(టీపీయూఎస్) రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు తీకుళ్ల సాయిరెడ్డి పిలుపునిచ్చారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు హక్కు నమోదులో భాగంగా దంతాలపల్లి, కుమ్మరికుంట్ల జడ్పీ ఉన్నత పాఠశాలలను మంగళవారం ఆయన సందర్శించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వేణుమాధవ్‌రెడ్డి, ప్రొ. మురళీధర్‌రెడ్డి, బండ శ్రీనివాస్‌రెడ్డి, హరిబాబు, మధుకర్, నాగిరెడ్డి, శ్రావణ్‌కుమార్, శ్రీదేవి, మంజుల పాల్గొన్నారు.

నకిలీ పురుగుమందులు విక్రయిస్తే కఠిన చర్యలు


జీకేపేటలో ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తున్న ఏడీఏ శ్రీనివాసరావు

బయ్యారం, న్యూస్‌టుడే: రైతులకు నకిలీ పురుగు మందులను విక్రయిస్తే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని మహబూబాబాద్ ఏడీఏ ఎ.శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండలంలోని జీకేపేటలో ఎరువులు, పురుగుమందుల దుకాణాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆగ్రోస్ రైతు సేవాకేంద్రంతోపాటు పలు దుకాణాల్లో రికార్డులను పరిశీలించారు. ఈపాస్ యంత్రాలను తనిఖీ చేశారు. దుకాణాల్లో ప్రిన్సిపల్ సర్టిఫికెట్లు (పీసీ)లు లేని వ్యాపారులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని వ్యాపారులను హెచ్చరించారు. కార్యక్రమంలో ఏవో రాంజీ, ఏఈవోలు పాల్గొన్నారు.

సంత వేలం రూ.5.75లక్షలు

కేసముద్రం, న్యూస్‌టుడే: కేసముద్రం(వి) పంచాయతీ పరిధిలో నిర్వహించే వారాంతపు సంతకు 23 వారాల కాలపరిమితితో మంగళవారం వేలం నిర్వహించారు. ఇన్‌ఛార్జి డీపీవో కనకదుర్గ ఆధ్వర్యంలో నిర్వహించిన వేలం పాటలో ఐదుగురు పాల్గొన్నారు. నెక్కొండ మండలానికి చెందిన రావుల మధుకర్‌రెడ్డి రూ.5.75 లక్షలకు వేలంలో దక్కించుకున్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి మిగిలిన 23 వారాలకు వేలం నిర్వహించారు. ఎంపీవో హరిప్రసాద్, పంచాయతీ కార్యదర్శి రాజు పాల్గొన్నారు.

● కేసముద్రం(వి) గ్రామంలోని ముత్యాలమ్మ ఆలయం నుంచి వ్యవసాయ భూముల వరకు రైతులు సొంత ఖర్చులతో నిర్మించుకున్న రోడ్డును పంచాయతీ నిధులతో నిర్మించినట్లు తప్పుడు రికార్డులు సృష్టించి రూ.4 లక్షలు కాజేశారని పలువురు రైతులు డీపీవో దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయమై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

గార్ల, న్యూస్‌టుడే: రైతులు మిరప, పత్తి, వరి పంటల సంరక్షణలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏడీఏ అజ్మీర శ్రీనివాస్ సూచించారు. మండలంలోని ముత్తితండా, కోట్యానాయక్‌తండాలోని మినుప, పత్తి పంటలను సందర్శించారు. మిరపలో పైముడత, నల్లి సమస్యలుతో పాటు పత్తిలో రసం పీల్చే పురుగులు, వరిలో బాక్టీరియా ఆకు ఎండుతెగులు వ్యాపించినట్లు గుర్తించామన్నారు. సస్యరక్షణ చర్యలకు వ్యవసాయశాఖ కార్యాలయంలోని అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని రైతులకు తెలిపారు. ఏవో రామారావు, ఏఈవో పూజిత వెంట ఉన్నారు.

భాజపా సభ్యత్వ నమోదుకు ఆదరణ



డోర్నకల్, న్యూస్‌టుడే: నగరాలు, పట్టణాలు, గ్రామాలలో భాజపా సభ్యత్వ నమోదుకు విశేష ఆదరణ లభిస్తోందని మాజీ ఎంపీ సీతారాంనాయక్ తెలిపారు. మంగళవారం డోర్నకల్‌లో చేపట్టిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. హరియాణా ఫలితాలతో ప్రజలు భాజపాను ఆదరిస్తున్నట్లు తెలిపారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్‌ను చూసి ఓట్లు వేయలేదని, కేసీఆర్‌పై వ్యతిరేకతతోనే రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని తెలిపారు. పార్టీ మండలాధ్యక్షుడు గణేష్, పట్టణాధ్యక్షుడు దేవ, నాయకులు లక్ష్మీనారాయణ వ్యాస్, ఎండీ రెహ్మాన్, ఉపేందర్, అనిల్, దేవేందర్ పాల్గొన్నారు.

నేర సమాచారం

యువకుడి ఆత్మహత్య

నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే: ఉరివేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మహబూబాబాద్ పట్టణంలోని నందీనగర్ కాలనీలో సోమవారం రాత్రి జరిగింది. పట్టణ సీఐ పెండ్యాల దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీకి చెందిన మంజాల సురేష్(30) జీవనోపాధికి హైదరాబాద్ వెళ్లారు. దసరా పండగకు వచ్చి తిరిగి వెళ్లే క్రమంలో తల్లి మందలించారని ఇంట్లో చీరతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనాస్థలిని వారు పరిశీలించారు. మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రికి తరలించారు. తల్లి మంజాల సత్తమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

అనారోగ్యంతో రైతు..

కేసముద్రం: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం కేసముద్రం మండలం మహమూద్‌పట్నం గ్రామంలో జరిగింది. ఎస్సై మురళీధర్‌రాజు తెలిపిన వివరాల మేరకు.. మహమూద్‌పట్నం గ్రామానికి చెందిన ఏశబోయిన లింగయ్య(53) కొద్ది రోజులుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. తీవ్ర మనస్తాపానికి గురైన లింగయ్య ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగారు. వెంటనే కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందారు. మృతుడి కుమారుడు ప్రవీణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పిచ్చికుక్క దాడిలో ఆరుగురికి గాయాలు

తొర్రూరు, న్యూస్‌టుడే: పిచ్చికుక్క స్వైరవిహారం చేసి డివిజన్ కేంద్రంలో మంగళవారం ఆరుగురిని గాయపరిచింది. వారిలో ఎస్సీ కాలనీకి చెందిన మంగళంపల్లి అనిల్, ఎం.చరిష్మా, ఎం.రుద్రదీప్, ఎం.ఉప్పమ్మ, సాయినగర్‌కు చెందిన ఎల్.హర్షిత ఉన్నారు. మరో బాధితుడు చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి రాలేదు. గాయపడిన వారిని ప్రాథమిక చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి ఇంజక్షన్‌లు అందించారు. ముగ్గురికి తీవ్రం కావడంతో మెరుగైన చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు ఆసుపత్రి వైద్యాధికారిణి డాక్టర్ జ్వలిత తెలిపారు. పట్టణంలో శునకాల బెడద ఎక్కువగా ఉందని, నియంత్రణకు చర్యలు తీసుకోవాలని తొర్రూరు వాసులు కోరుతున్నారు.

బాలుడి అదృశ్యంపై కేసు

నెహ్రూసెంటర్: పట్టణంలోని హనుమంతునిగడ్డ కాలనీకి చెందిన భాషా, రజియా దంపతుల కుమారుడు మస్తాన్ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ పి.దేవేందర్ తెలిపారు. బాలుడు మస్తాన్(15) బయ్యారం మండలం ఇస్లాపురంలోని వసతి గృహంలో ఏడోతరగతి చదువుతున్నాడు. సోమవారం ఉదయం 11 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లి సాయంత్రం వరకు తిరిగిరాలేదు. ఆచూకీ తెలియకపోవడంతో మంగళవారం బాలుడి తండ్రి బాషా పట్టణ ఠాణాలో ఫిర్యాదు చేశారు.

అరెస్టు

నెల్లికుదురు: తాళం వేసి ఉన్న ఇళ్లనే లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడుతున్న ఒకర్ని అరెస్టు చేసినట్లు ఎస్సై సీహెచ్.రమేష్‌బాబు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. తొర్రూరు మండలం సోమారంకుంటతండా శివారు తుల్స్యతండాకు చెందిన బానోత్ నవీన్ మండలంలోని చిన్నముప్పారం, రాజులకొత్తపల్లి గ్రామాల్లో చోరీలకు పాల్పడ్డాడు. అతని నుంచి ఒక చరవాణి, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకొని, అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్సై వివరించారు.

వసతిగృహం రికార్డుల స్వాధీనం

దంతాలపల్లి, న్యూస్‌టుడే: దంతాలపల్లిలోని ప్రభుత్వ గిరిజన బాలుర సంక్షేమ వసతిగృహాన్ని ఏటీడీవో గుగులోత్ దేశీరాం మంగళవారం రాత్రి తనిఖీ చేశారు. పలు రికార్డులు, సరకుల నిల్వలను పరిశీలించారు. ఉపాధ్యాయులు, వసతిగృహం సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. వసతి గృహంలోని పలు రికార్డులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తనిఖీలకు సంబంధించిన నివేదికను రూపొందించిన తదుపరి చర్యల నిమిత్తం జిల్లా డీడీకి అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయుడు వీరాసింగ్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

పాఠశాల అభివృద్ధికి చేయూత

నెల్లికుదురు, న్యూస్‌టుడే: మండలంలోని ఆలేరు జడ్పీ ఉన్నత పాఠశాలలో 2023-24విద్యా సంవత్సరంలో పదోతరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థిని కమటం ఐశ్వర్య పాఠశాల అభివృద్ధికి మంగళవారం రూ.పది వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఐశ్వర్యను ప్రధానోపాధ్యాయుడు రాందాస్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

వీరభద్రుడి సన్నిధిలో శ్రీపాల్‌రెడ్డి పూజలు

కురవి: భద్రకాళి సమేత కురవి శ్రీ వీరభద్రస్వామిని పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి శ్రీపాల్‌రెడ్డి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా సంఘం ప్రకటించడంతో సంఘం జిల్లా నాయకులతో కలిసి స్వామి వారిని దర్శించుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు బద్రీనారాయణ, ప్రధాన కార్యదర్శి సతీశ్‌రెడ్డి, మండలాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, వెంకటేశ్, సుజాత ఉన్నారు.

ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠ పూజలు



గార్ల: మర్రిగూడెం సమీపంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠను బుధవారం ఉదయం 8.15 గంటలకు ప్రారంభించనున్నారు. మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రవాస భారతీయులు డాక్టర్ పులి గోపాలరెడ్డి, ప్రమీలరెడ్డి, రమేష్‌బాబు, వేణుగోపాలరావు, లక్ష్మణ్‌నాయక్, శ్రీనివాస్, సత్యం, కనకశేఖరం, పరీక్షన్ నరేందం తదితరులున్నారు.

నిత్యావసర వస్తువులు అందజేత

బయ్యారం: బయ్యారం పంచాయతీ కార్మికులకు ఎన్జీవోస్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో నిత్యావసర వస్తువులను మంగళవారం పంపిణీచేశారు. మాజీ ఉపసర్పంచి కవిత, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మంగీలాల్ అందించారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు

ఇనుగుర్తి, న్యూస్‌టుడే: మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం నుంచి నవంబర్ 14 వరకు పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయనున్నట్లు ఇనుగుర్తి మండల పశువైద్యాధికారి రవీందర్ అన్నారు. పాడి రైతులందరూ ముందస్తుగా పశువులకు టీకాలు వేయించాలన్నారు.

16న హైదరాబాద్‌లో ధర్నా

మహబూబాబాద్: జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)లో విధులు నిర్వహిస్తున్న ఒప్పంద, పొరుగుసేవల ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం సూపరింటెండెంట్ వలీయుద్దీన్‌కు ఎన్‌హెచ్ఎం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని ఈ నెల 16న హైదరాబాద్‌లోని వైద్య ఆరోగ్యశాఖ ప్రధాన కార్యాలయం వద్ద నిర్వహించనున్న ధర్నాలో పాల్గొనేందుకు అనుమతివ్వాల్సిందిగా కోరుతూ విన్నవించారు. అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ కుమార్, రుక్ముద్దీన్, గౌరవ అధ్యక్షుడు కర్నాకర్, నాయకులు సౌమిత్, వసంత తదితరులున్నారు.

'చలో హైదరాబాద్' విజయవంతం చేయాలి



దంతాలపల్లి: ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఈ నెల 20న హైదరాబాద్‌లో నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి కోరారు. కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను దంతాలపల్లిలో మంగళవారం విడుదల చేశారు. టీయూసీఐలో ఐఎఫ్‌టీయూ కార్మిక సంఘం విలీనం కానున్న నేపథ్యంలో సభ నిర్వహించనున్నట్లు తెలిపారు.

బయ్యారం: ట్రేడ్ యూనియన్ సెంట్రల్ ఆఫ్ ఇండియా(టీయూసీఐ)లో ఐఎఫ్‌టీయూ విలీనం అవుతున్న సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించనున్న 20న జరిగే సభను కార్మికులు జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్యం కోరారు. బయ్యారంలో గోడపత్రికలను మంగళవారం ఆవిష్కరించి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు.

కార్యదర్శి, రైతు పరస్పర దాడులు..?

గూడూరు: గూడూరు మండలంలోని ఓ మద్యం గొలుసు దుకాణం వద్ద ఓ పంచాయతీ కార్యదర్శి, రైతు సోమవారం రాత్రి మద్యం తాగుతూ పరస్పరం దూషించుకుని దాడులు చేసుకున్నట్లు వీడియో మంగళవారం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టింది. ఈ విషయంపై గూడూరు ఎస్ఐ గిరిధర్‌రెడ్డి మాట్లాడుతూ ఘర్షణకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు రాలేదని చెప్పారు.

29 వరకు గడువు

మహబూబాబాద్: విదేశీ విద్యాలయాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే ఎస్సీ విద్యార్థులను అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకానికి ఎంపిక చేసేందుకు దరఖాస్తుల గడువును పొడిగించినట్లు జిల్లా ఇన్‌ఛార్జి షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి నర్మద ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరంలో యుఎస్ఏ, యూకే, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, జపాన్, జర్మనీ, సౌత్ కొరియా, న్యూజిలాండ్ విశ్వవిద్యాలయంలో పోస్టు గ్రాడ్యుయేషన్ ప్రొఫెషనల్ కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థులు ఈ నెల 29వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం కల్పించినట్లు ఆమె తెలిపారు.

దేవస్థాన ధర్మకర్తల మండలికి దరఖాస్తులు

నర్సింహులపేట: నర్సింహులపేటలోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థాన నూతన ధర్మకర్తల మండలి ఏర్పాటుకు ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో వేణుగోపాల్ మంగళవారం తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు సంబంధిత దరఖాస్తులను పూర్తి చేసి వరంగల్‌లోని దేవాదాయశాఖ కమిషనర్ కార్యాలయంలో సమర్పించాలన్నారు. ఇరవై రోజుల్లో అందజేయాలని కోరారు.

ప్రశ్నించే శక్తులు ఏకం కావాలి



కురవి: ప్రశ్నించే ప్రగతిశీల శక్తులు ఏకమై పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ప్రొ.సాయిబాబా చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సమావేశంలో నాయకులు రమేశ్, సమ్మయ్య, సారయ్య, అనీల్‌కుమార్, సురేశ్ పాల్గొన్నారు

కొత్తగూడ: ప్రొఫెసర్ సాయిబాబా మృతికి తుడుందెబ్బ సంఘం నేతలు కొత్తగూడలో ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. రాష్ట్ర నాయకుడు ఆగబోయిన రవి మాట్లాడుతూ సాయిబాబా ఆదివాసీల కోసం పలు పోరాటాలు నిర్వహించారని కొనియాడారు. నాయకులు చిన్నరవి, లక్ష్మీనారాయణ, నాగేశ్వర్‌రావు, ప్రవీణ్, శరత్, పాల్గొన్నారు.

18 నుంచి పోటీలు

గార్ల, న్యూస్‌టుడే: మర్రిగూడెంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి క్రీడా మైదానంలో ఈ నెల 18 నుంచి నాలుగు జిల్లాల గ్రామీణస్థాయి కబడ్డీ, డ్యాన్స్ పోటీలు నిర్వహించనున్నట్లు బంజార యువజన సేవా సంఘం మర్రిగూడెం క్రీడా నిర్వాహక బాధ్యులు భూక్యా రాంసింగ్, చిరంజీవి, శాంతికుమార్, రమేష్, చిన్న తెలిపారు. గ్రామీణస్థాయి కబడ్డీ, డ్యాన్స్‌బేబీ డ్యాన్స్ పోటీలు ఉంటాయని వెల్లడించారు. జాంకీరాజ్ మెమోరియల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ 32వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మర్రిగూడెంలో మంగళవారం కరపత్రాలను విడుదల చేశారు. ఔత్సాహికులు 94920 64002, 90141 18193, 90109 43242, 96189 31852ను సంప్రదించాలని కోరారు. విశ్రాంత రైల్వే అధికారి కస్నానాయక్ తదితరులున్నారు.

గిరిజన బాలుర వసతి గృహం తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్ చంద్రరాజేశ్వర్

దంతాలపల్లి, న్యూస్‌టుడే: గిరిజన బాలుర వసతి గృహంలో సన్న బియ్యం లెక్కల్లో తేడా ఉన్నట్లు అధికారులు మంగళవారం గుర్తించారు. స్థానిక తహసీల్దార్ చంద్రరాజేశ్వర్ కథనం ప్రకారం.. దంతాలపల్లిలోని ప్రభుత్వ గిరిజన బాలుర సంక్షేమ వసతి గృహంలో తహసీల్దార్ చంద్రరాజేశ్వర్, దంతాలపల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు వేణుమాధవ్‌రెడ్డి, ఆర్ నజీమోద్దీన్ తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. సెప్టెంబర్ 1 నుంచి అక్టోబర్ వరకు వసతి గృహానికి కేటాయించిన బియ్యం కేటాయింపులో 8 క్వింటాళ్ల తేడా ఉన్నట్లు గుర్తించారు. మరో 16 క్వింటాళ్ల బియ్యం, ఇతర పాఠశాలలు, పెద్దముప్పారంలోని వసతి గృహం నుంచి తీసుకొచ్చినట్లు లెక్కలు చూపి, తెచ్చిన బియ్యాన్ని తిరిగి వారికి అప్పగించినట్లు రికార్డుల్లో నమోదు చేశారు. 24 క్వింటాళ్ల బియ్యం లెక్కల్లో తేడాపై నివేదిక రూపొందించి కలెక్టర్‌కు అందించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ విషయమై వార్డెన్ ఠాకూర్ వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా ఇతర పాఠశాలల నుంచి బియ్యం అరువుగా తీసుకువచ్చినట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కురవి, న్యూస్‌టుడే: మండలంలోని రాజోలు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపారు. సెప్టెంబరు 25న వారధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల స్థాయిలో సంరక్షణ, గృహ పనులకు వేతనం ఇవ్వాలా వద్దా అనే అంశంపై ఆన్‌లైన్‌లో వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పదో తరగతి విద్యార్థులు శివ, అంగద్ పాల్గొన్నారు. ఫలితాలు మంగళవారం వెల్లడించగా ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించి రూ.30 వేలు నగదుకు ఎంపికైనట్లు ప్రకటించారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు రవికుమార్ సన్మానించారు. ఉపాధ్యాయులు కిషన్, వెంకట్‌రెడ్డి, దామోదర్, మోహన్, బీకు, సురేశ్, రవికుమార్, రాజేశ్వరి, కాశీనాద్, వసంత, సతీశ్ కిరణ్ ఉన్నారు.